సాక్షి
మెదక్
గురువారం । 31 । జూలై । 2025



స్వచ్ఛతకు దూరంగా..!

పేరుకే గ్రేడ్ వన్ మున్సిపాలిటీ సంగారెడ్డి.. స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంకులో మాత్రం 94వ స్థానానికి పరిమితమైంది. వివరాలు 8లో ▸



పెద్ద చెరువుకు ముప్పు

అమీన్‌పూర్ పెద్ద చెరువుకు ముప్పు ఏర్పడింది. కట్ట తెగిపోయే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. వివరాలు 8లో ▸



ఎమ్మెల్యేగారూ.. మీకిది తగునా!

ఎమ్మెల్యే సునీతారెడ్డి నిరాధారమైన ఆరోపణలు చేయడం తగదని కాంగ్రెస్ నాయకులు అన్నారు. వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

ఖాళీ సీట్ల భర్తీకి నేడు స్పాట్ కౌన్సెలింగ్

రామాయంపేట(మెదక్): గురుకుల కళాశాలల్లో ఖాళీల భర్తీకి గురువారం స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు రాష్ట్ర గురుకులాల జోనల్ అధికారిణి ప్రత్యూష ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జోన్‌లోని ఐదు జిల్లాల పరిధిలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ, ఒకేషనల్ కోర్సుల్లో ఉన్న ఖాళీల భర్తీకి గాను ఆయా కళాశాలల్లోనే కౌన్సెలింగ్ నిర్వహించనున్నామని తెలిపారు. మార్చిలో నిర్వహించిన పదో తరగతి పరీక్షలో ఒకేసారి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు అర్హులన్నారు. ఆయా సబ్జెక్టుల్లో వచ్చిన మార్కుల ఆధారంగా ఎంపిక విధానం ఉంటుందన్నారు. ఇతర వివరాలకు ఆయా కళాశాలల్లో ప్రిన్సిపాళ్లను సంప్రదించాలని సూచించారు.

సరిపడా యూరియా నిల్వలు



ఎరువుల దుకాణంలో రైతులతో మాట్లాడుతున్న డీఏఓ దేవ్‌కుమార్

చేగుంట(తూప్రాన్): జిల్లాలో 3,343 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు ఉన్నాయని జిల్లా వ్యవసాయాధికారి దేవ్‌కుమార్ అన్నారు. బుధవారం చేగుంటలోని పలు ఎరువుల దుకాణాలను సందర్శించి రికార్డులు పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మోతాదుకు మించి యూరియా వాడకూడదని రైతులకు సూచించారు. పంట కాలంలో రెండు పర్యాయాలు నానో యూరియా వాడాలని సూచించారు. జిల్లాలో యూరియా నిల్వలు సరిపడా ఉన్నాయని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. అధిక ధరలకు ఎరువులు విక్రయించినా, ప్రైవేటు ఎరువులు మందులు బలవంతంగా విక్రయించాలని ప్రయత్నం చేస్తే రైతులు మండల వ్యవసాయ అధికారికి ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి హరిప్రసాద్, రైతులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



రోడ్డుపై పారుతున్న మురుగు నీటిని పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్

నర్సాపూర్: సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మున్సిపల్ కమిషనర్ శ్రీరాంచరణ్‌రెడ్డి అన్నారు. బుధవారం మున్సిపాలిటీ పరిధిలోని మూడో వార్డులో పర్యటించారు. కాలనీలో మురికి కాలువలు, తాగు నీటి సమస్య, పారిశుద్ధ్యం పనులు సరిగా లేవని కాలనీవాసులు ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. ఈమేరకు కమిషనర్ స్పందిస్తూ త్వరలో ఆయా సమస్యలు పరిష్కరిస్తానని వారికి హామీ ఇచ్చారు.

17 అడుగులకు చేరిన పోచారం నీటిమట్టం



హవేళిఘణాపూర్(మెదక్): మండల పరిధిలోని పోచమ్మరాళ్ శివారులో ఉన్న పోచారం డ్యామ్‌కు నీటి మట్టం పెరిగింది. కొన్ని రోజులుగా ఎగువన ఉన్న కామారెడ్డి జిల్లాలో భారీ వర్షాలు కురుస్తుండడంతో చెరువు, కుంటల నుంచి భారీగా నీరు చేరుతుంది. బుధవారం నాటికి డ్యామ్‌లో 17 ఫీట్ల నీరు చేరింది. మరో మూడున్నర ఫీట్లు చేరితే డ్యామ్ పొంగిపొర్లనుంది.

బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం



ప్రధాని, ఎంపీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

హవేళిఘణాపూర్(మెదక్): బీజేపీతోనే రాష్ట్రం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందుతుందని ఆపార్టీ జిల్లా అధ్యక్షుడు మల్లేష్‌గౌడ్ అన్నారు. బుధవారం పీఎంశ్రీ పథకం కింద మండలంలోని కూచన్‌పల్లి జెడ్పీ పాఠశాలను ఎంపిక చేసి వసతుల కల్పనకు కేంద్రం కృషి చేయడంపై ప్రధాని నరేంద్ర మోదీ, ఎంపీ రఘునందన్ రావు చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ రాష్ట్ర అభివృద్ధికి ఎన్నో నిధులు మంజూరు చేసిందని వివరించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు శ్రీపాల్, ఎంఎల్ఎన్ రెడ్డి, నవీనచారి, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

రైల్వేలైన్ విస్తరణ!

- త్వరలో ప్రారంభం కానున్న పనులు
- జిల్లా వాసులకు తీరనున్న కష్టాలు



రామాయంపేట(మెదక్): మేడ్చల్–ముత్కేడ్ మధ్య రైల్వేలైన్ విస్తరణకు అడుగులు పడుతున్నాయి. ఈమేరకు త్వరలో పనులు ప్రారంభం కానున్నాయి. ఈ ప్రాజెక్టు పూర్తయితే జిల్లా వాసులకు వెసులుబాటు కలగనుంది. గంటల తరబడి రైళ్ల కోసం, క్రాసింగ్‌ల వద్ద వేచి ఉండే పరిస్థితికి చెల్లుబాటు కానుంది. ఇది ముత్కేడ్, డోన్ డబ్లింగ్ ప్రాజెక్టు పరిధిలోకి వస్తుంది. ఇందుకు సంబంధించి 418 కిలోమీటర్ల మేర డబ్లింగ్ లైన్ నిర్మాణం కోసం రూ. 4,686 కోట్ల అంచనాతో నిధులు మంజూరయ్యాయి. ప్రస్తుతం ఉన్న సింగిల్ లేన్‌తో ప్రయాణికులు ఇబ్బందులపాలవుతున్నారు. రెండు వరుసల లేన్‌కోసం ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్నారు. పలుమార్లు కేంద్ర మంత్రులు, ఎంపీలను కలిసి విన్నవించగా, ఎట్టకేలకే గతేడాది కేంద్రం నిధులు మంజూరు చేసింది. ప్రాధాన్యత క్రమంలో ఇప్పటికే మేడ్చల్ వరకు రెండో లేన్ నిర్మాణం పూర్తయింది. మరో వైపు నిజామాబాద్ నుంచి పుణ్యక్షేత్రమైన బాసర వరకు డబ్లింగ్ లేన పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. బాసర గోదావరి నదిపై భారీస్థాయిలో బ్రిడ్జి నిర్మాణం చేపడుతున్నారు. రెండేళ్ల లోపు రెండో లేన్ నిర్మాణ పనులు పూర్తి చేయాలని దక్షిణ మధ్య రైల్వేశాఖ అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు.



విస్తరించనున్న అక్కన్నపేట స్టేషన్

మారనున్న స్టేషన్ల రూపురేఖలు

జిల్లాలో మనోహరాబాద్, వడియారం, పాలాట పోతారం, మీర్జాపల్లి, బ్రాహ్మణపల్లి, శ్రీనివాసనగర్, మాసాయిపేట, అక్కన్నపేట రైల్వేస్టేషన్లు ఉన్నాయి. జిల్లా పరిధిలో 41 కిలోమీటర్ల మేర రైల్వేలైన్ విస్తరించి ఉంది. 2006లో ఈలైన్ మీటర్ గేజ్ నుంచి బ్రాడ్ గేజుకు మారింది. మూడేళ్ల క్రితం అక్కన్నపేట నుంచి మెదక్, మనోహరాబాద్ నుంచి గజ్వేల్ వరకు నూతనంగా రైల్వేలైన్ నిర్మించారు. దీంతో అక్కన్నపేట, మనోహరాబాద్ స్టేషన్లు జంక్షన్లుగా మారాయి. రెండో లేన్ నిర్మాణం పూర్తయితే జిల్లా పరిధిలో ఉన్న స్టేషన్ల రూపురేఖలు మారనున్నాయి. గతంలో ఎప్పుడో నిర్మించిన పలు స్టేషన్ల భవనాలు చాలా వరకు పాక్షికంగా శిథిలమయ్యాయి. వీటి స్థానంలో కొత్త భవనాలు, ప్లాట్ ఫాంలు, అదనపు సదుపాయాలు కల్పించడానికి అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఇప్పటికే మేడ్చల్ నుంచి ముత్కేడ్ వరకు రైల్వేలైన్‌ను పూర్తిస్థాయిలో విద్యుదీకరించారు. ఇదే విషయమై రైల్వేశాఖ ఉన్నతాధికారి మాట్లాడుతూ.. మేడ్చల్ నుంచి ముత్కేడ్ వరకు రెండో లేన్ పనులు కొనసాగుతున్నాయని చెప్పారు. సర్వే గతంలోనే పూర్తి కాగా, ప్యాకేజీల వారీగా ప్రాధాన్యత క్రమంలో పనులు జరుగుతున్నాయని చెప్పారు. ప్రస్తుతం నిజామాబాద్, బాసర మధ్య డబ్లింగ్ లేన్ పనులు కొనసాగుతున్నాయని వెల్లడించారు.




డబుల్ లేన్‌గా మారనున్న మేడ్చల్- అక్కన్నపేట రైల్వేలైన్ ఇదే..

డబ్లింగ్‌తో ప్రయోజనాలు

- ప్రయాణం వేగవంతంతో పాటు సమయం తగ్గుతుంది
- రైళ్ల సంఖ్య పెరుగుతుంది
- అదనపు రైళ్లతో పాటు గూడ్స్‌రైళ్లు ప్రవేశపెట్టే అవకాశం
- రెండో లైన్ నిర్మాణం పూర్తయితే భవిష్యత్తులో ఎంఎంటీఎస్ రైళ్ల పొడిగింపు
- రైల్వేస్టేషన్లను ఆధునీకరణకు అవకాశం

ఫలించిన పోరాటం

- 2003 డీఎస్సీ టీచర్లకు పాత పెన్షన్
- హైకోర్టు తీర్పుపై సర్వత్రా హర్షం
- ఉమ్మడి జిల్లాలో 800 పైచిలుకు మందికి మేలు



మెదక్‌జోన్: 2003 డీఎస్సీ టీచర్ల రెండు దశాబ్దాల పోరాటం ఫలించింది. పాత పెన్షన్ వర్తింపచేయాలని హైకోర్టు తీర్పునివ్వడంతో సంబుర పడుతున్నారు. 2003లో డీఎస్సీలో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 800పై చిలుకు అభ్యర్థులు ఎంపికయ్యారు. కానీ అప్పట్లో కామన్ సర్వీస్ రూల్స్‌కు సంబంధించి గవర్నమెంట్, లోకల్‌బాడీ స్కూల్స్ ఒకే గొడుగు కిందకు తేవాలంటూ కోర్టులో కేసు నడవడంతో ప్రభుత్వం 2005 నవంబర్‌లో వీరికి అపాయింట్‌మెంట్ ఇచ్చింది. కాగా 2004లో అప్పటి ప్రభుత్వం పాత పెన్షన్ విధానం రద్దు చేసి నూతన పెన్షన్ విధానం అమలు చేసింది. ఈ నేపథ్యంలో 2005లో ఉద్యోగంలో చేరిన వారు కొత్త పెన్షన్ కిందకు వస్తారని ప్రభుత్వం పేర్కొంది. దీంతో 2003 డీఎస్సీలో ఎంపికైన ఉపాధ్యాయులు ఆందోళనకు గురయ్యారు. తమకు న్యాయబద్ధంగా పాతపెన్షన్ అమలు చేయాలని కోర్టును ఆశ్రయించారు. సుదీర్ఘ కాలంగా హైకోర్టులో ఈ కేసు కొనసాగింది. చివరగా 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ అమలు చేయాలని ఇటీవల హైకోర్టు తీర్పునివ్వటంతో ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వెంటనే అమలు చేయాలి



హైకోర్టు ఆదేశాలను వెంటనే అమలు చేయాలి. ఇప్పటివరకు తమ వేతనంలో ప్రతి నెల కట్ చేసిన 10 శాతాన్ని తిరిగి చెల్లించటంతో పాటు పాతపెన్షన్ (ఓపీఎస్) విధానంలో వచ్చే లబ్ధిని అమలు చేయాలి.

– సంతోషి కుమారి, ఉపాధ్యాయురాలు

సంతోషంగా ఉంది



న్యాయబద్ధంగా మాకు రావాల్సిన పాతపెన్షన్ (ఓపీఎస్) స్కీం కోసం 20 ఏళ్లుగా ఆందోళన చెందాం. చివరకు హైకోర్టు తీర్పుతో న్యాయం జరిగింది. ఇది మా జీవితంలో మరచిపోలేని ఘట్టం.

– రఘుబాబు, ఉపాధ్యాయుడు

కస్తూర్బా బాలికలకు క్రీడా దుస్తులు

- జిల్లాలో 15 కేజీబీవీలు.. 3,498 విద్యార్థినులు
- ఉత్తమ ఫలితాలు సాధిస్తున్న విద్యాలయాలు



ఆటలు ఆడుతున్న విద్యార్థినులు

పాపన్నపేట(మెదక్): ఆల్‌రౌండర్లుగా రాణిస్తున్న కేజీబీవీ విద్యార్థినులను మెరికల్లాంటి క్రీడా కారిణులుగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో విద్యాశాఖ వారికి క్రీడా దుస్తులు, షూలు ఇవ్వాలని నిర్ణయించింది. సమగ్రశిక్ష నిధులతో వాటిని సమకూర్చాలని సూచించింది. జిల్లాలో 15 కేజీబీవీల్లో.. 9 పాఠశాలల్లో ఇంటర్ వరకు, 6 స్కూళ్లలో హైస్కూల్ వరకు తరగతులు కొనసాగుతున్నాయి. ఇందులో స్కూల్ స్థాయిలో 3,363 మంది, ఇంటర్ మీడియెట్‌లో 864 విద్యార్థినులు చదువుతున్నారు.

ఆల్‌రౌండర్లుగా రాణింపు

కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు పరిపూర్ణ వికాస కేంద్రాలుగా విరాజిల్లుతున్నాయి. విద్యార్థినులు ఆట, పాట, చదువుల్లో ప్రతిభ కనబరుస్తున్నారు. గతంలో పాపన్నపేట విద్యార్థిని మౌనిక 9 తరగతి చదువుతున్నప్పుడే కిలి మంజారో పర్వతాన్ని అధిరోహించి రికార్డు సృష్టించింది. 2024లో ఓటుహక్కు వినియోగంపై అవగాహన కల్పిస్తూ హైదరాబాద్‌లో జరిగిన సాంస్కృతిక కార్యక్రమంలో నర్సాపూర్ కేజీబీవీ విద్యార్థినులు రాష్ట్రస్థాయి బహుమతి సాధించారు. గతేడాది పదో తరగతిలో 8 పాఠశాలలు 100 శాతం ఫలితాలు సాధించాయి. మొత్తం మీద 93.99 శాతం ఉత్తీర్ణత సాధించాయి. ఇంటర్ సెకండ్ ఇయర్‌లో 77.64 శాతం ఉత్తీర్ణత పొందారు. విద్యార్థినులను ప్రోత్సహిస్తే మెరుగైన ఫలితాలు వస్తాయన్న అభిప్రాయంతో విద్యాశాఖ మెరుగైన సౌకర్యాలు కల్పిస్తుంది.

అభివృద్ధి పనులపై ఆరా



అక్కన్నపేట అటవీ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కేంద్ర బృందం

రామాయంపేట(మెదక్): అక్కన్నపేట, తొనిగండ్ల, కోమటిపల్లి అటవీ ప్రాంతంలో చేపట్టిన పనులను కంపా స్కీం ప్రతినిధులు (కేంద్ర బృందం) బుధవారం పరిశీలించారు. 2022– 24 మధ్య విడతల వారీగా చేపట్టిన పనులను పరిశీలించి నమోదు చేసుకున్నారు. అటవీ ప్రాంతంలో నాటిన మొక్కలతో పాటు కుంటల నిర్మాణం, చెక్ డ్యాంలు, నాలా ప్లాంటింగ్, ఫైర్‌లైన్లను తనిఖీ చేశారు. వారి వెంట రేంజ్, సెక్షన్, బీట్ అధికారులు పాల్గొన్నారు.

వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలి

మెదక్ కలెక్టరేట్: ప్రభుత్వం హమాలీలకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి మల్లేశం డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. డిసెంబర్ 7 నుంచి 9వ తేదీ వరకు మెదక్‌లో జరిగే సీఐటీయూ రాష్ట్ర మహాసభలలో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి సంతోష్, మార్కెట్ యార్డ్ హమాలీ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

అర్హులందరికీ రేషన్ కార్డులు ఇస్తాం

కలెక్టర్ రాహుల్‌రాజ్



చిత్రియాల్‌లో రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

పాపన్నపేట(మెదక్)/హవేళిఘణాపూర్: జిల్లాలో కొత్తగా 9,964 కొత్త రేషన్ కార్డులు మంజూరు చేశామని, వీటి ద్వారా 44,694 మందికి లబ్ధి చేకూరినట్లు కలెక్టర్ రాహుల్‌రాజ్ తెలిపారు. బుధవారం మండల పరిధిలోని చిత్రియాల్‌లో రేషన్ కార్డులు పంపిణీ చేసి మాట్లాడారు. ఎన్నో ఏళ్లుగా రేషన్‌కార్డుల కోసం ఎదురుచూస్తున్న పేదల కల నెరవేరిందన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ రమాదేవి, తహసీల్దార్ సతీశ్, జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గోవింద్‌నాయక్, మండల నాయకులు ప్రశాంత్‌రెడ్డి, మోహన్, సురేష్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు. అలాగే హవేళిఘణాపూర్ మండల పరిధిలోని కూచన్‌పల్లి రైతు వేదికలో పలువురు లబ్ధిదారులకు కలెక్టర్ నూతన రేషన్ కార్డులను పంపిణీ చేశారు. అనంతరం ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేసి విద్యార్థులకు పెడుతున్న ఆహారాన్ని పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనంతో పాటు ఉత్తమ విద్య నందించాలని ఉపాధ్యాయులకు సూచించారు.

విజిబుల్ పోలీసింగ్ అమలు చేయాలి

ఎస్పీ డీవీ శ్రీనివాసరావు



సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ శ్రీనివాసరావు

మెదక్ మున్సిపాలిటీ: పట్టణంలో విజిబుల్ పోలీసింగ్ అమలు చేయాలని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు సిబ్బందికి సూచించారు. బుధవారం మెదక్ పట్టణ పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారుల పట్ల గౌరవంగా వ్యవహరిస్తూ సత్వర పరిష్కారం చూపించాలన్నారు. బాగా పనిచేసే సిబ్బందికి రివార్డ్, అవార్డ్స్, గుర్తింపు ఉంటుందన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహించొద్దని, క్రమశిక్షణ సమయపాలన పాటించాలన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ అప్రమత్తతతో విధులు నిర్వర్తించాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా చూడాలన్నారు. కష్టపడి పనిచేసి ప్రజలకు మంచి సేవలు అందించాలన్నారు. అనంతరం స్టేషన్‌లో నమోదైన కేసుల వివరాలు, రౌడీ షీటర్లు, సస్పెక్ట్ షీట్లు, పట్టణంలో నేరాలు, డయల్ 100, బీట్ సిస్టం, పెట్రోలింగ్‌పై ఆరా తీశారు. కార్యక్రమంలో డీఎస్పీ ప్రసన్నకుమార్, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ మధుసూదన్, పట్టణ సీఐ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్‌పై అప్రమత్తంగా ఉండాలి

డీఎంహెచ్‌ఓ శ్రీరామ్



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ శ్రీరామ్

టేక్మాల్(మెదక్): సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యాధికారి శ్రీరామ్ అన్నారు. బుధవారం మండలంలోని ఎల్లుపేటలో నిర్మిస్తున్న ఆరోగ్య కేంద్రం భవన నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి రికార్డులు తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నూతనంగా నిర్మించే ఆస్పత్రి భవన నిర్మాణ పనులను వేగవంతం చేయాలని సూచించారు. సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించాలన్నారు. వ్యాధులు ప్రబలకుండా ముందస్తుగానే గ్రామాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి చికిత్స అందించాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహించకుండా ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. ఆయన వెంట ప్రోగాం ఆఫీసర్స్ హరిప్రసాద్, నవ్య, వైద్యురాలు హర్షిత తదితరులు ఉన్నారు.

సిగాచీకి ప్రొహిబిటెడ్ ఆర్డర్

ప్రాణాలు పోయాక ఆర్డరిచ్చిన పరిశ్రమల శాఖ



కర్మాగారాల తనిఖీ అధికారి కార్యాలయం

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: సిగాచీ పరిశ్రమ ప్రమాదం జరిగాక ఫ్యాక్టరీల శాఖ మేల్కొంది. ఈ పరిశ్రమలో పేలుడు ఘటన జరిగి 54 మంది కార్మికుల ప్రాణాలు పోయాక ఫ్యాక్టరీల శాఖ అధికారులు ఇప్పుడు ఆ యాజమాన్యానికి ప్రొహిబిటెడ్ ఆర్డర్‌ను జారీ చేశారు. ఈ పరిశ్రమల్లో కార్మికుల భద్రతా ప్రమాణాలు పాటించకపోవడంతో ప్రమాదం జరిగిందని, నిబంధనల ప్రకారం ఇక్కడ ఉత్పత్తి కార్యకలాపాలు జరగలేదని, తిరిగి తాము అనుమతిచ్చేంత వరకు ఇందులో ఉత్పత్తి చేయవద్దని ఈ ఆర్డర్‌లో పేర్కొన్నారు. ఫ్యాక్టరీలను ఎప్పటికప్పుడు తనిఖీలు చేసి భద్రత ఏర్పాట్లను పరిశీలించాల్సిన ఈశాఖ అధికారులు ప్రమాదం జరగకముందు ఎందుకు స్పందించలేదనే విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.

బాధ్యులైన అధికారులపై చర్యలేవి?

ప్రమాదం జరిగిన నెల రోజులు గడిచినా ఇప్పటివరకు బాధ్యులైన ఒక్క అధికారిపై కూడా చర్యలు తీసుకోకపోవడం విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ ఘటనపై శాఖ పరమైన విచారణ కొనసాగుతోందని ఆ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. ఈ పరిశ్రమను ఇప్పటివరకు తనిఖీలు చేసిన అధికారులు భద్రతా లోపాలను గుర్తించారా? గుర్తిస్తే వాటిని సరిచేయాలని పరిశ్రమ యాజమాన్యానికి నోటీసులిచ్చారా? సరి చేయకుండా నిర్లక్ష్యం చేసిన పరిశ్రమ యాజమాన్యాన్ని ప్రమాదం జరిగే వరకు ఎందుకు ఉపేక్షించారు? వంటి అంశాలపై ఆ శాఖ ఇప్పటికీ వెల్లడించడం లేదు.

నిపుణుల కమిటీ నివేదికపై స్పష్టత ఏది?

ప్రమాదం జరిగిన వెంటనే సీఎస్ఐఆర్-ఐఐసీటీ శాస్త్రవేత్త వెంకటేశ్వరరావు నేతృత్వంలోని నలుగురు నిపుణుల బృందాన్ని నియమించినట్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఈ కమిటీ నివేదిక ఇచ్చిందా? ఇవ్వలేదా? అనేది తేలలేదు. ఆ నివేదికను ప్రభుత్వం వెంటనే బహిర్గతం చేయాలనే డిమాండ్ వ్యక్తమవుతోంది.

అమృత్.. ఆలస్యం

- మెదక్ బల్దియాలో ప్రారంభం కాని పనులు
- రామాయంపేట, తూప్రాన్‌లో కొనసాగుతున్న పనులు
- నర్సాపూర్‌లో అర్ధాంతరంగా ఆగిన వైనం
- తాగునీటికి తప్పని తిప్పలు



తూప్రాన్‌లో కొనసాగుతున్న ట్యాంకు నిర్మాణ పనులు

మెదక్‌జోన్: దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించని చందంగా మారింది అధికారుల పరిస్థితి. మున్సిపాలిటీల్లో స్వచ్ఛమైన తాగునీటిని అందించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం గతేడాది అమృత్ (అటల్ మిషన్) పథకంలో భాగంగా కోట్లాది రూపాయలు మంజూరు చేసింది. కానీ, పనులు మాత్రం ముందుకు సాగడం లేదు. ఫలితంగా ఆయా బల్దియాల ప్రజలకు తాగునీటి కష్టాలు తప్పటం లేదు.

రూ. 58 కోట్లు మంజూరు

జిల్లాలో మెదక్, తూప్రాన్, రామాయంపేట, నర్సాపూర్ మున్సిపాలిటీలున్నాయి. మున్సిపాలిటీల పరిధిలోని ప్రజలకు శుద్ధజలాలు అందించాలని కేంద్ర ప్రభుత్వం 2024 ఆగస్టులో నాలుగు మున్సిపాలిటీలకు రూ. 58 కోట్లు మంజూరు చేసింది. ఇందులో అతిపెద్ద మున్సిపాలిటీ మెదక్ బల్దియాకు రూ.30 కోట్లు మంజూరయ్యాయి. ఇందులో భాగంగా 31 లక్షల లీటర్ల సామర్థ్యంతో 6 ట్యాంకులు, 48.83 కిలోమీటర్ల పైపులైన్లు, పలు ట్యాంకుల చుట్టూ ప్రహరీ నిర్మించాల్సి ఉంది. అయితే ఈ పనులు ఇప్పటికీ ప్రారంభం కాలేదు. ఫలితంగా బల్దియాలో నిత్యం ఏదోఒక చోట తాగునీటి సమస్య ఉత్పన్నమవుతూనే ఉంది. అలాగే నర్సాపూర్ మున్సిపాలిటీకి రూ.12 కోట్లు మంజూరు కాగా, రెండు ట్యాంకుల నిర్మాణ పనులు ప్రారంభించినప్పటికీ అందులో ఒకటి 7.50 లక్షల లీటర్ల సామర్థ్యం గల ట్యాంకు నిర్మాణ పనులు కొనసాగుతుండగా, మరో ట్యాంకు 6 లక్షల లీటర్ల సామర్థ్యం గల ట్యాంకు పనులను ఓ ప్రైవేట్ వ్యక్తి స్థలంలో ప్రారంభించగా సదరు భూమి యజమాని పనులను నిలిపివేయించాడు. రామాయంపేట మున్సిపాలిటీకి రూ.7 కోట్లు, తూప్రాన్ మున్సిపాలిటీకి రూ.9 కోట్లు మంజూరు కాగా, పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి.

అమలెప్పుడో మరి!

శాశ్వత తాగునీటి సమస్య పరిష్కారం కోసం కోట్లాది నిధులు మంజూరైనా అవి వృథాగా మగ్గిపోతున్నాయి. ఈ నిధులతో తాగునీటి ట్యాంకుల నిర్మాణాలతో పాటు పైపులైన్లు వేసి వాటికి ఎలక్ట్రిక్ వైర్లను అనుసంధానం చేయాల్సి ఉంటుంది. దీంతో పైపులైన్ల లీకేజీలు ఏర్పడినా, లేక నీరు తక్కువగా వస్తున్నా పైపులైన్లకు అనుసంధానం చేసిన వైర్ ద్వారా తెలిసిపోతుంది.

త్వరలో పనులు ప్రారంభం

జిల్లాలో నాలుగు మున్సిపాలిటీలు ఉండగా, ఇప్పటికే మూడింటిలో పనులు ప్రారంభమయ్యాయి. మెదక్ మున్సిపాలిటీలో మరో వారం రోజుల్లో పనులు ప్రారంభిస్తాం.

– మహేశ్‌బాబు, ఈఈ పబ్లిక్ హెల్త్, మెదక్

క్లుప్తంగా

పిల్లర్ గుంతలోపడి వృద్ధుడు మృతి


మృతుడు కిషన్

హవేళిఘణాపూర్(మెదక్): ప్రమాదశాత్తు పిల్లర్ గుంతలో పడి వృద్ధుడు మృతి చెందాడు. ఈ ఘటన మండల పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ నరేశ్ వివరాలిల ప్రకారం.. శమ్నాపూర్ గ్రామానికి చెందిన కాటిపడిగల కిషన్(67) తన ఇంటి నిర్మాణం కోసం తీసిన పిల్లర్ గుంతలో కాలుజారి పడిపోయాడు. ఇటీవల కురిసిన వర్షాలతో గుంతలో నీరు నిల్వడంతో వెంటనే ఆయనను కుటుంబీకులు పైకి తీసే లోపే అపస్మారక స్థితికి చేరుకున్నాడు. అతడ్ని మెదక్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతునికి భార్య నర్సమ్మ, కుమారుడు ఉన్నాడు.

2 నుంచి జిల్లా స్థాయి యోగా పోటీలు

చేగుంట(తూప్రాన్): యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మండల కేంద్రమైన చేగుంటలో ఆగస్టు2న జిల్లా స్థాయి యోగా పోటీలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గణేష్‌రవికుమార్ తెలిపారు. సబ్ జూనియర్ నుంచి 55 సంవత్సరాల వరకు గల స్త్రీ, పురుషుల వరకు 6 కేటగిరిలలో పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. చేగుంట ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించే ఈ పోటీల్లో ప్రతిభ కనబర్చిన వారిని ఆదిలాబాద్ నిర్మల్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు పంపించనున్నట్లు తెలిపారు. వివరాలకు 96666 32023 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.

చెరువులో మృతదేహం లభ్యం

హత్య చేసి చెరువులో పడేసినట్లు అనుమానం

చేర్యాల(సిద్దిపేట)/మద్దూరు(హుస్నాబాద్): అదృశ్యమైన వ్యక్తి చెరువులో మృతదేహమై కనిపించాడు. స్థానిక పోలీసుల వివరాల ప్రకారం ... మృతదేహం ములుగు మండల కేంద్రానికి చెందిన తిగుళ్ల నెహ్రూ(35)గా గుర్తించారు. ములుగు ఐకేపీ కార్యాలయంలో ఆపరేటర్‌గా పని చేసే నెహ్రూ సోమవారం ఉదయం రోజు వారీగా కార్యాలయానికి వెళ్లాడు. తిరిగి రాత్రి ఇంటికి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు మంగళవారం ములుగు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మిస్సింగ్ కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు. ఈ క్రమంలో బుధవారం గాగిళ్లాపూర్ చెరువులో మృతదేహం ఉన్నట్లు స్థానికుల ద్వారా తెలుసుకున్న పోలీసులు చెరువు వద్దకు వెళ్లి మృతదేహాన్ని బయటకు తీశారు. ములుగు పోలీసులు నెహ్రూ మృతదేహంగా గుర్తించారు. ఇదిలా ఉంటే కాళ్లు చేతులు కట్టి, నడుముకి బండరాయి కట్టి ఉండటంతో ఎక్కడో హత్య చేసి తీసుకువచ్చి పడేసినట్లు అనుమానిస్తున్నారు. కాగా మృతుడి బంధువులు స్టేషన్ ఎదుట నిరసన చేశారు.

ఆలయంలో చోరీ



నర్సాపూర్: నర్సాపూర్‌లోని సాయిబాబ ఆలయంలో మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఆలయ ద్వారం తాళాలు ధ్వంసం చేసి లోపలికి ప్రవేశించిన దుండగులు హుండీ తాళం పగలగొట్టి అందులో నుంచి సుమారు రూ.20వేలు ఎత్తుకెళ్లారని ఆలయ కమిటీ సభ్యుడు శ్రీనివాస్‌యాదవ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కాగా, ఎస్‌ఐ లింగం చోరీ జరిగిన చోట క్లూస్ టీం ద్వారా ఆధారాలు సేకరించారు.

పేకాట స్థావరంపై దాడి

దుబ్బాకరూరల్: పేకాట స్థావరంపై దాడి చేసి ఏడుగురిని అరెస్టు చేశారు. ఈ ఘటన మండలంలోని ఆకారం గ్రామంలో జరిగింది. ఎస్‌ఐ కీర్తి రాజు వివరాల ప్రకారం... బుధవారం రాత్రి గ్రామ శివారులో కొంత మంది వ్యక్తులు పేకాట ఆడుతున్నారని నమ్మదగిన సమాచారం మేరకు పోలీసులు దాడి చేశారు. ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.36,280 నగదు, నాలుగు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు.

స్వచ్ఛతకు దూరంగా..!

పేరుకే సంగారెడ్డి గ్రేడ్ వన్ మున్సిపాలిటీ

- గతేడాది స్వచ్ఛ సర్వేక్షణ్‌లో 94వ ర్యాంకు
- కంపు కొడుతున్న డంప్‌యార్డ్
- ముక్కుపిండి పన్నులు వసూలు..
- వసతులు మాత్రం శూన్యం


బొబ్బిలి కుంటలో కాలుతున్న చెత్త

సంగారెడ్డి: పేరుకే గ్రేడ్ వన్ మున్సిపాలిటీ సంగారెడ్డి.. గతేడాది స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంకులో మాత్రం 94వ స్థానానికి పరిమితమైంది. పట్టణంలో కంపు కొడుతున్న డంపుయార్డ్ , వసతుల లేమి, మౌలిక సదుపాయాలు, స్వచ్ఛత విషయంలో వెనకబడటంతో వెరసి సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీనికంతటికి కారణం మున్సిపాలిటీలో ప్రైవేటు వ్యక్తుల హవాతో అధికారులు ఎలాంటి అభివృద్ధి, వంద రోజుల ప్రణాళిక పనులు సైతం చేయలేకపోతున్నారన్న ఆరోపణలు సైతం వినిపిస్తున్నాయి.

పారిశుద్ధ్యంపై పర్యవేక్షణేది?

పారిశుద్ధ్యం మెరుగు పరచడంతో పాటు మున్సిపాలిటీల రూపురేఖలు మార్చడానికి ప్రభుత్వం వంద రోజుల ప్రణాళికకు శ్రీకారం చుట్టింది. జూన్ 2వ తేదీ నుంచి సెప్టెంబరు 10 వరకు క్షేత్రస్థాయిలో రోజుకో కార్యక్రమం నిర్దేశించారు. కానీ సంగారెడ్డిలో స్వచ్ఛ నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. వివిధ విభాగాల మధ్య సమన్వయం లేకపోవడంతో ఎక్కడ ఏం పని జరుగుతుందో తెలియని అయోమయ స్థితిలో అధికారులు ఉన్నారు. ప్రత్యేకాధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా పనులు నామమాత్రంగా కొనసాగుతున్నాయి. ఇకనైనా ప్రణాళిక పనులు పటిష్టంగా అమలు చేసేలా జిల్లా కలెక్టర్, మున్సిపాలిటీ కమిషనర్ చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అమలు కానీ ప్రణాళిక..!

ప్రతి మార్పు అభివృద్ధికి బాటలు అనే నినాదంతో.. 50 అంశాల్లో రోజుకో కార్యక్రమం చేపట్టాల్సి ఉంది. కానీ పట్టణంలో మాత్రం జరగడం లేదు.

గతేడాది సర్వేలోనూ లాస్ట్..

దేశవ్యాప్తంగా జరిగిన స్వచ్ఛ సర్వేక్షణ్ 2024 పట్టణాల సర్వే ఫలితాలను రాష్ట్రపతి జూలై 17న విడుదల చేశారు. ఇందులో రాష్ట్రాల వారీగా మున్సిపాలిటీల ర్యాంకులను ప్రకటించారు. అయితే సంగారెడ్డి జిల్లాలోని తెల్లాపూర్ మున్సిపాలిటీ ప్రథమ స్థానంలో ఉండగా సంగారెడ్డి, అందోల్ జోగిపేట్ మున్సిపాలిటీలు చివరి స్థానంలో ఉన్నాయి. తెల్లాపూర్ -18, అమీన్‌పూర్ - 31, సదాశివపేట్ - 52, జహీరాబాద్ -54 , బొల్లారం నారాయణఖేడ్ -89 , సంగారెడ్డి - 94, అందోల్ జోగిపేట్ -118వ స్థానంలో నిలిచాయి.

సామాజిక, స్వచ్ఛంద మహిళా సంఘాలను భాగస్వాములను చేస్తూ, పారిశుద్ధ్యం, పచ్చదనం తదితర కార్యక్రమాలు నిర్వహించి, శిథిల భవనాలను గుర్తించి వాటిని తొలగించాలి.

ప్రైవేట్ వ్యక్తుల హవా

పట్టణ అభివృద్ధిలో వార్డు అధికారులదే కీలక పాత్ర. అందుకు ప్రతి వార్డుకు ఓ అధికారిని నియమించారు. వీరు ఆశించిన స్థాయిలో పనులు చేయడం లేదు. చాలా వరకు కార్యాలయానికే పరిమితమవుతున్నారు. వార్డుల్లో ఎక్కడి సమస్యలు అక్కడే పేరుకుపోతున్నాయి. వార్డు అధికారుల విధులకు సంబంధించి ఉత్తర్వులను ఇటీవలే పురపాలక శాఖ విడుదల చేసింది. కానీ వారి చేతిలో ఏమి లేని అయోమయ స్థితిలో ఉన్నారు. కాలనీల్లో ఏ పని జరగాలన్న ప్రైవేట్ వ్యక్తుల హవాతో అధికారులకు తెలియకుండానే జరిగిపోతున్నాయని విమర్శలు వినిపిస్తున్నాయి.

నంబర్‌వన్‌కు ప్రయత్నిస్తా..



స్వచ్ఛత విషయంలో సంగారెడ్డి మున్సిపాలిటీని నంబర్ వన్‌గా తయారు చేసేందుకు చర్యలు తీసుకుంటాం. ప్రతిరోజు పనులను పరీక్షించేందుకు ప్రణాళికలు తయారు చేస్తున్నాం. ప్రజలు కూడా అధికారులకు సహకరించాలి.

– శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్, సంగారెడ్డి

వ్యవసాయ రంగంలో విస్తృత పరిశోధనలు

- కావేరి యూనివర్సిటీతో ఎంఓయూ
- ఇక్రిశాట్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ హిమాన్షు పాఠక్ వెల్లడి


మాట్లాడుతున్న ఇక్రిశాట్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ హిమాన్షు పాఠక్, పక్కన కావేరి చాన్సలర్, వీసీ

వర్గల్(గజ్వేల్): విస్తృత పరిశోధనల ద్వారా వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టిన ఇక్రిశాట్, దేశంలోనే తొలి అంతర్జాతీయ వ్యవసాయ పరిశోధన సంస్థగా ప్రసిద్ధి పొందిందని ఆ సంస్థ డైరెక్టర్ జనరల్ డాక్టర్ హిమాన్షు పాఠక్ పేర్కొన్నారు. బుధవారం సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం గౌరారం కావేరి యూనివర్సిటీ, విత్తన, పరిశోధన సంస్థలను ఆయన సందర్శించారు. ఇక్రిశాట్‌లో వివిధ సాంకేతికతలు, పరిశోధనలు అందిపుచ్చుకునేందుకు కావేరి వర్సిటీ ముందుకు రావడంతో ఎంఓయూ కుదుర్చుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా వ్యవసాయరంగంలో పాత పద్ధతులకు స్వస్తి పలికి, డ్రోన్స్ తదితర అధునాతన యంత్రాల వినియోగం , నూతన సాంకేతిక పరిజ్ఞానం అందిపుచ్చుకోవాలన్నారు. త్వరలోనే పాడి భూములలో వ్యవసాయంపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమం చేపట్టనున్నట్లు వివరించారు. రైతులకు మేలు చేకూరేలా 120-125 రోజుల తక్కువ వ్యవధిలో ఒకేసారి ఖాత వచ్చే 'ఐసీపీవీ 25444' కంది వంగడాన్ని అభివృద్ధి చేశామన్నారు. ఎండాకాలంలోనూ, 45 డిగ్రీల ఉష్ణోగ్రతను ఇది తట్టుకుని, అధిక దిగుబడి నిస్తుందన్నారు. విత్తన సంస్థ, పరిశోధన కేంద్రంతో కూడిన కావేరి యూనివర్సిటీ దేశంలోనే మొట్ట మొదటి అగ్రిటెక్ యూనివర్సిటీగా విద్యార్థులకు పరిశోధనాత్మక విద్య లభిస్తుందన్నారు. హైదరాబాద్‌కు ఇక్రిశాట్, కావేరి యూనివర్సిటీలు సమీపంలో ఉండటం అనుకూలాంశమన్నారు. కావేరి చాన్సలర్ భాస్కర్‌రావు, వైస్‌చాన్సలర్ డాక్టర్ ప్రవీణ్‌రావు మాట్లాడుతూ.. వ్యవసాయ విశ్వవిద్యాలయం, విత్తన పరిశ్రమ, రీసెర్చ్ కేంద్రం ఒకే చోట కలిగి ఉన్న కావేరి యూనివర్సిటీ దేశంలోనే మొట్టమొదటిదిగా వివరించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ పవన్ రావు, రిజిస్ట్రార్ డాక్టర్ శ్రీనివాసులు, స్టూడెంట్ వెల్ఫేర్ డైరెక్టర్ డాక్టర్ హర్షరావు, అగ్రికల్చర్ డీన్ డాక్టర్ ప్రతాప్ రెడ్డి, టెక్నాలజీ డీన్ డాక్టర్ కొండా శ్రీనివాస్ పాల్గొన్నారు.

పంట పురుగులకు దీపం ఎరతో చెక్

వ్యవసాయ సహాయ సంచాలకుడు రాజ్‌నారాయణ


దీపం ఎర వినియోగంపై అవగాహన కల్పిస్తున్న ఏడీఏ

రామాయంపేట(మెదక్): దీపం ఎరలతో వరి, మొక్కజొన్న, పత్తి చేన్లలో కాండం తొలిచే పురుగు ఉధృతని అరికట్టవచ్చని వ్యవసాయ సహాయ సంచాలకుడు రాజ్‌నారాయణ పేర్కొన్నారు. దీపపు ఎరల వినియోగంపై బుధవారం మండలంలోని లక్ష్మాపూర్‌లో రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వీటి నివారణకుగాను తరచూ పురుగుల మందులను పిచికారీ చేస్తే వాటిలో రోగనిరోధక శక్తి పెరుగుతుందన్నారు. ఇలా చాలాసార్లు మరిన్ని శక్తివంతమైన మందులు పిచికారీ చేయాల్సి ఉంటుందని, దీంతో పంట ఉత్పత్తి తగ్గడంతోపాటు రైతులకు ఆర్థిక భారం పడుతుందని తెలిపారు. కాండం తొలిచే పురుగు నివారణకు సాయంత్రం వేళ పంటచేన్లలో దీపపు కాంతి ఎరలను అమర్చడం ద్వారా వాటిని ఆకర్షించి చంపివేయడమే ఏకైక మార్గమన్నారు. దీపం ఎర తయారీకి రైతుకు కేవలం రూ.మూడు నుంచి నాలుగు వందలు మాత్రమే ఖర్చవుతాయని తెలిపారు.

రసాయన డ్రమ్ముల దహనం.. బ్లాస్టింగ్

భయంతో పరుగులు తీసిన తగలబెట్టిన వ్యక్తులు, స్థానికులు


ఘటనా స్థలంలో పేలిన డ్రమ్ములు

పటాన్‌చెరు టౌన్: ఓ పరిశ్రమకు చెందిన రసాయన డ్రమ్ములను డంప్‌యార్డ్ సమీపంలో తగలబెట్టడంతో పేలుడు సంభవించి పెద్ద ఎత్తున మంటలు వ్యాపించాయి. ఈ ఘటన బుధవారం ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని పాశమైలారం పారిశ్రామికవాడలో చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం... ఓ పరిశ్రమ వారు డంప్‌యార్డ్ సమీపంలో రసాయన డ్రమ్ములను తగలబెట్టడంతో ఒక్కసారిగా పేలాయి. ఈ హఠాత్పరిణామానికి తగలబెట్టిన వ్యక్తులు, స్థానికులు దూరంగా పరుగులు తీశారు. స్థానికులు ద్వారా సమాచారం తెలుసుకున్న అగ్నిమాపక శాఖ అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఈ ఘటనతో చుట్టూ ఉన్న చెట్లు కాలిపోయాయి. అయితే ఈ ఘటనలో ఎవరికీ ఏమీ కాకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

మంత్రి వివేక్ వ్యాఖ్యలు సరికాదు

బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణ శర్మ


విలేకరులతో మాట్లాడుతున్న రాధాకృష్ణ శర్మ

సిద్దిపేటజోన్: జిల్లాపై అవగాహన లేక, అక్కసుతో మంత్రి వివేక్ వరుసగా చేస్తున్న వ్యాఖ్యలు ఆయన అవివేకానికి నిదర్శనమని బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణ శర్మ విమర్శించారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ... ఆయన తండ్రి వెంకట్ స్వామిని ఎంపీగా చేయడంలో సిద్దిపేట ప్రజల పాత్ర ఉందన్నారు. దాన్ని మరిచి మంత్రి సిద్దిపేటపై అక్కసు, అసూయతో వ్యాఖ్యలు చేయడాన్ని ప్రజలు సహించరని స్పష్టం చేశారు. సిద్దిపేటను చెన్నూరుతో పోల్చడం హాస్యాస్పదంగా ఉందన్నారు. సిద్దిపేట వెయ్యి పడకల ఆస్పత్రి అవసరమా అని వ్యాఖ్యలను తాము ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. చెన్నూరుకు వెయ్యి పడకల ఆస్పత్రి మంజూరు చేయకపోవడం ఆయన అసమర్థతగా అభిప్రాయపడ్డారు. కేసీఆర్ హయాంలో జిల్లాలో 11673 డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు పంపిణీ చేశారని, అది తెలియక ఇండ్లు రాలేదని అనడం అసత్య ప్రచారమన్నారు. జిల్లాలో రైతులు ఎరువుల కోసం పడిగాపులు కాస్తున్నారని ఆరోపించారు. సమస్య పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోలేదని విమర్శించారు. ఈ సమావేశంలో సీనియర్ నాయకులు భూపేశ్, శ్రీనివాస్, మోహన్ లాల్, పీఏసీఎస్ చైర్మన్ రమేశ్, కనకరాజు, సోమిరెడ్డి, మాజీ ఎంపీపీ వైస్ పాపయ్య పాల్గొన్నారు.

రోడ్డు దాటుతుండగా కారు ఢీ..

వ్యక్తి దుర్మరణం

సదాశివపేట(సంగారెడ్డి): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి అక్కడికక్కడే దుర్మణం చెందాడు. ఈ ఘటన 65వ నంబర్ జాతీయ రహదారి మద్దికుంట చౌరస్తా వద్ద బుధవారం సాయంత్రం చోటు చేసుకుంది. సీఐ వెంకటేశం కథనం ప్రకారం... పట్టణ పరిధిలోని దక్కన్‌దాబా వద్ద మద్దికుంట వెళ్లడానికి కల్లప్ప(43)అనే వ్యక్తి రోడ్డు దాటుతున్నాడు. ఇదే సమయంలో సంగారెడ్డి నుంచి జహీరాబాద్ వైపు వెళ్తున్న మారుతి వేగనార్ డ్రైవర్ అతివేగంగా నడిపి ఢీకొట్టాడు. దీంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు కల్లప్ప కర్నాటకలోని బీదర్ జిల్లా పర్వాటి మండలం బెల్లల్లీ గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. మృతుడు స్థానికంగా ఉన్న ఓ పరిశ్రమలో కార్మికునిగా పనిచేస్తున్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి


శివకుమార్‌గౌడ్

హవేళిఘణాపూర్(మెదక్): రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడికి తీవ్ర గాయాలై మృతి చెందాడు. ఈ ఘటన బుధవారం వెలుగులోకి వచ్చింది. వివరాలిలా ఉన్నాయి. మెదక్ మండలం చిట్యాల గ్రామానికి చెందిన యాదాగౌడ్ కుమారుడు శివకుమార్‌గౌడ్(20) పదవ తరగతి వరకు చదువుకుని నాలుగు నెలల క్రితం ఉపాధి కోసం హైదరాబాద్‌కు వెళ్లి మేడ్చల్‌లోని ఓ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. ఈ క్రమంలో మేడ్చల్‌లోని తన రూమ్‌కు తిరిగి వస్తుండగా ఈ నెల 18న బొలెరో వాహనం ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు.

రెండు బైకులు ఢీ..

ఇద్దరికి గాయాలు

పాపన్నపేట(మెదక్): మల్లంపేటకు చెందిన పుట్టి నాగరాజు నార్సింగిలో చేపలు అమ్ముకుని బైక్‌పై పాపన్నపేటకు వస్తున్నాడు. శంకరంపేట మండలం దానంపల్లికి చెందిన నర్రసాయిబాబా మెదక్ నుంచి స్వగ్రామానికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో నార్సింగి శివారులోని ఆలయ సమీపంలో రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో నాగరాజు తలకు తీవ్ర గాయాలు కాగా, సాయిబాబాకు కాలు విరిగింది. వీరిని మెదక్ ఆస్పత్రికి తరలించారు.నాగరాజు పరిస్థితి విషమంగా ఉంది.

మరో ఘటనలో నలుగురికి..

శివ్వంపేట(నర్సాపూర్): రెండు బైక్‌లు ఢీకొన్న ఘటనలో నలుగురికి గాయాలయ్యాయి. ఈ ఘటన తూప్రాన్- నర్సాపూర్ హైవే తిమ్మాపూర్ బస్టాండ్ వద్ద బుధవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు వివరాలు... తిమ్మాపూర్‌కు చెందిన పోల్‌దాస్ సాలమ్మ కొడుకు బన్నీతో కలిసి బైక్‌పై గ్రామానికి వస్తున్నారు. ఈ క్రమంలో శివ్వంపేటకు చెందిన భిక్షపతి, జగదీష్ నర్సాపూర్ నుంచి శివ్వంపేటకు వస్తుండగా రెండు బైక్‌లు ఢీకొన్నాయి. సాలమ్మకు తీవ్ర గాయాలు కాగా సూరారం నారాయణ ఆస్పత్రికి తరలించారు. ఇదే ప్రమాదంలో గాయాలైన ముగ్గురు చికిత్స పొందుతున్నారు.

బీసీ రిజర్వేషన్ బిల్లుకు బీజేపీ వ్యతిరేకం

సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు స్కైలాబ్ బాబు



మాట్లాడుతున్న స్కైలాబ్‌బాబు

చేర్యాల(సిద్దిపేట): నలభైరెండు శాతం బీసీ రిజర్వేషన్‌కు బీజేపీ వ్యతిరేకమని, అందుకే పార్లమెంట్‌లో బిల్లును ప్రవేశపెట్టడం లేదని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు టి.స్కైలాబ్‌బాబు ఆరోపించారు. బుధవారం పట్టణ కేంద్రంలో జరిగిన చేర్యాల, మద్దూరు, కొమురవెల్లి, దూల్మిట్ట మండలాల రాజకీయ శిక్షణ తరగతులకు ఆయన హాజరై మాట్లాడారు. బీజేపీ కుల,మతాల మధ్య విద్వేషాలు సృష్టిస్తూ ప్రజల ఐక్యతను విడదీస్తుందని విమర్శించారు. చిత్తశుద్ధి ఉంటే తక్షణమే పార్లమెంటులో బిల్లును ఆమోదించాలని డిమాండ్ చేశారు. రైతాంగానికి యూరియా కొరత ఏర్పడిందని, దీనిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమస్యను పక్కదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. శిక్షణ తరగతులకు ప్రిన్సిపాల్‌గా సత్తిరెడ్డి వ్యవహరించగా జిల్లా కార్యదర్శి మల్లారెడ్డి, నాయకులు యాదవరెడ్డి, శశిధర్, వెంకట్‌మావో, యాదగిరి, అరుణ్, రవీందర్, కృష్ణారెడ్డి, శారద, ప్రశాంత్, శిరీష, నాగరాజు, షఫీ, రాజు, ఇస్తారీ, బాలకిషన్, శ్రీహరి, శోభ పాల్గొన్నారు.

బాల కార్మికుడికి విముక్తి

దుబ్బాకటౌన్: బాల కార్మికునికి పని నుంచి విముక్తి కల్పించిన ఘటన పట్టణంలో బుధవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ కీర్తి రాజు వివరాల ప్రకారం... పట్టణంలోని పోచమ్మ గుడి సమీపంలో పెంటం యాదగిరి అనే వ్యక్తి బైక్ మెకానిక్ షాప్ నిర్వహిస్తున్నాడు. షాపులో 17 సంవత్సరాల బాలుడిని పనికి పెట్టుకున్నాడు. దీంతో సమాచారం అందుకున్న సిద్దిపేట జిల్లా అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ మహమ్మద్ వికార్ బాబా ఆధ్వర్యంలో కార్మిక శాఖ అధికారులు ఆపరేషన్ ముస్కాన్ - 11లో భాగంగా పోలీసుల సహకారంతో మెకానిక్ షాప్‌పై దాడి చేసి, బాల కార్మికునికి విముక్తి కల్పించారు. కార్మిక శాఖ అధికారి ఫిర్యాదు మేరకు బాల కార్మిక సంరక్షణ చట్టం ప్రకారం మెకానిక్ షాప్ యజమానిపై కేసు నమోదైంది.

స్టార్టర్ బాక్స్ చోరీ

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని మహమ్మద్ నగర్ గ్రామ పంచాయతీ బోర్‌మోటార్‌కు ఉన్న స్టార్టర్ బాక్స్‌ను గుర్తుతెలియని వ్యక్తులు మంగళవారం రాత్రి చోరీ చేశారు. గ్రామానికి నీటిని సరఫరా చేసే మల్లన్నగుడి సమీపంలోని బోరుమోటార్ వద్ద ఉన్న డబ్బా తాళం పగలగొట్టి అందులో నుంచి స్టార్టర్‌ను చోరీ చేశారు. నాలుగు సార్లు స్టార్టర్‌ను చోరీ చేశారని, రెండు సార్లు కేబుల్‌వైర్ పోయినట్లు పంచాయతీ కార్యదర్శి ప్రసాద్ తెలిపారు.

గంజాయి కేసులో వ్యక్తికి జైలు


సత్రాజ్ హుస్సేన్

జహీరాబాద్ టౌన్: గంజాయి కేసులో ఓ వ్యక్తికి జైలు శిక్షతో పాటు జరిమానా విధిస్తూ జిల్లా అదనపు జడ్జి బుధవారం తీర్పు చెప్పారని ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. వివరాలోకి వెళితే... ముంబాయికి చెందిన సత్రాజ్ హుస్సేన్(39) 2019లో కారులో 16 కిలోల గంజాయిని అక్రమంగా ముంబాయి నుంచి హైదరాబాద్‌కు తరలిస్తున్నాడు. కోహీర్ మండల కవేలి చౌరస్తా వద్ద ఎక్సైజ్ అధికారులు వాహనాలు తనిఖీలు నిర్వహిస్తుండగా ఎండు గంజాయితో హుస్సేన్ పట్టుబడ్డాడు. అప్పట్లో కేసు నమోదు చేసి ఆయనను రిమాండ్‌కు పంపారు. కేసు పూర్వాపరాలు విన్న తరువాత జడ్జి హుస్సేన్‌కు 5 ఏళ్ల జైలు శిక్ష, రూ.25 వేల జరిమానా విధించింది.

పెద్ద చెరువుకు ముప్పు

- గొలుసు కట్టు చెరువులకు తెగిన లింక్
- 2021లోనే కబ్జాల గుర్తింపు.. తొలగని నిర్మాణాలు
- ఆందోళన వ్యక్తం చేస్తున్న రైతులు, ప్రజలు

పటాన్‌చెరు: అమీన్‌పూర్ పెద్ద చెరువు బయోడైవర్సిటీ సైట్‌గా గుర్తింపు పొందింది. విదేశీ పక్షులకు ఆలవాలంగా ఉండే ఈ తటాకం కళావిహీనంగా మారింది. చుట్టూ పెద్ద పెద్ద భవంతులు ఏర్పడటంతో డ్రైనేజీ నీరు వచ్చి చెరువులో కలుస్తోంది. అలుగులు పూడుకుపోవడటంతో నిండుకుండలా ఉంది. అయితే శిఖం భూమి కబ్జా కాకుండా, ఎఫ్‌టీఎల్‌ను గుర్తించేందుకు ఇరిగేషన్ అధికారులు నీటిని కిందకు వదలడం లేదని తెలుస్తోంది. దీంతో చెరువు కట్ట తెగిపోయే ప్రమాదం ఉందని స్థానిక రైతులు, అక్కడ ఏర్పడిన పలు కాలనీల ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

కనుమరుగైన కాల్వలు..

గతంలో పెద్ద చెరువు నుంచి బంధం కొమ్ము చెరువు వరకు గొలుసుకట్టు చెరువులుగా, వాటికి అనుసంధానంగా కాలువలు ఉండేవి. కానీ, కొత్తగా వెంచర్లు వెలుస్తుండటంతో కొన్ని చోట్ల కాలువలు కబ్జా అవుతున్నాయి. ఎగువ భాగం నుంచి వరద తీవ్రత పెరిగినప్పుడు చెరువుల నుంచి పల్లపు ప్రాంతాలకు వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తే ఆర్ఆర్ హోమ్స్ పరిసర ప్రాంతాలు పూర్తిగా నీట మునుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. పెద్ద చెరువు ఎగువ భాగంలో రియల్ సంస్థలు 30 అంతస్తుల హై రైజ్ భవనాలు, అపార్ట్‌మెంట్లు నిర్మిస్తున్నారు. దీంతో చెరువు నీరు రైతుల పొలాల్లోకి పారుతోంది. స్థానిక రైతులు తమ పొలాల్లో నీరు ఉండకుండా ఎత్తు పెంచేందుకు మట్టిని పోస్తున్నారు. కొన్ని దశాబ్దాలుగా తాము ఈ ప్రాంతంలో ఉన్నామని ఎప్పుడు లేనిది పొలాలు నీట మునుగుతున్నాయని స్థానిక రైతు రామిరెడ్డి వాపోయారు.

కాల్వలు కబ్జా.. పూడుకుపోయిన అలుగు


నిండు కుండలా పెద్ద చెరువు

విచారణ చేసి చర్యలు తీసుకుంటాం

పెద్ద చెరువుకు పెద్దగా ప్రమాదం లేదు. బంధం కొమ్ము వైపు కాలువల కబ్జా అంశంపై ఉన్నతాధికారుల సూచనలు అవసరం. గతంలో అప్పటి కలెక్టర్ హనుమంతరావు మౌఖిక ఆదేశాలిచ్చారే కానీ లిఖిత పూర్వక ఆదేశాలివ్వలేదు. అక్కడ కొన్ని ఇళ్లను తొలగించాలని సూచించారు. బంధం కొమ్ము చెరువు కింద కాలువలను కబ్జా చేస్తూ అపార్ట్‌మెంట్లు నిర్మిస్తున్నారన్న విషయంపై పూర్తిస్థాయి విచారణ చేసి చర్యలు తీసుకుంటాం.

– జైభీమ్, ఇరిగేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సంగారెడ్డి

పొంచి ఉన్న ప్రమాదం...!

వర్షాలు ఎక్కువగా కురిస్తే అలుగులు లేని చెరువుతో ప్రమాదం పొంచి ఉందని, అదే జరిగితే ఇప్పుడున్న కాలనీలన్ని నీటి మునిగే ప్రమాదం ఉందని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. కబ్జా అయిన కాల్వలను పునరుద్ధరించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడుతున్నారు. బందం కొమ్ము చెరువు శిఖం, కాల్వలు కబ్జా అయ్యాయని.. 2021లో అప్పటి కలెక్టర్ హన్మంతరావు నిర్ధారించారు. అలాగే క్షేత్ర స్థాయిలో సైతం పర్యటించి అక్కడ నిర్మాణాలను కూల్చాలని స్థానిక అధికారులకు కూడా సూచించారు. కానీ నేటికీ హైడ్రా వచ్చినా కబ్జాలను తొలగించలేదని సమీప కాలనీల ప్రజలు, రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా కబ్జాకు గురైన కాల్వలను పునరుద్ధరించాలని, చెరువు నిండినప్పుడు నీరు సాఫీగా వెళ్లేలా చూడాలని కోరుతున్నారు.